తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అప్పుల బాధ తట్టుకోలేక రైతు ఆత్మహత్య

### పురుగుల మందు తాగి ఆసుపత్రులకు పరుగులు



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం దళితవాడకు చెందిన కిషోర్ (26)అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బుధవారం పురుగుల మందు తాగిన ఆతను ప్రాణం మీద తీపితో తాను పురుగుల మందు తాగినట్లు ఆసుపత్రికి పరుగులు తీస్తున్నట్లు తన తల్లి, భార్యకు చరవాణిలో సమాచారం అందించారు. మొదట అతను తన మోటార్‌సైకిల్‌పై గ్రామానికి 8 కిలోమీటర్ల దూరంలోని పట్టణంలోని నగరివీధిలో ఉన్న ఓ ప్రైవేటు డాక్టర్ వద్దకు వెళ్ళాడు. అక్కడ స్పృహతప్పి పడిపోవటంతో అతని స్నేహితులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవపరచారు. తొండమనాడు అరుంధతి వాడకు చెందిన కిషోర్ వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆతనికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాకుండా కుటుంబ పోషణ, నిర్వహణకు అప్పులు చేసారు. అప్పుల వత్తిడిభరించలేక కిషోర్ ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులు మందుతాగినట్లు రూరల్‌ఎస్ఐ వెంకటేష్ వివరించారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టంకు పంపామన్నారు. కేసు విచారణలో ఉందన్నారు.



పేరూరు గుట్టపై వెలసిన శ్రీవకుళమాత ఆలయాన్ని దర్శించిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబసభ్యులు

## సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష

### రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా



మంత్రి రోజాను గజమాలతో సత్కరిస్తున్న ఎంపీపీ మునివేలు, సర్పంచ్ విరిత

పుత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీరామరక్ష అని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా అన్నారు. బుధవారం పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీలో మంత్రి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ప్రతి కుటుంబం వద్దకు చేరుకుని వారికి అందుతున్న, అందిన సంక్షేమ ఫలాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీసి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇంటింటా మంత్రికి మహిళలు కర్పూర హారతులు పట్టారు. అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, ఎంపీడీవో ఇందిరమ్మ, సీడీపీవో పద్మజ, ఎంఈవో తిరుమల రాజు, ఏపీఎం డి.వి.సుబ్బారెడ్డి, వైఎస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు విరిత, మురళి, గోవిందస్వామిరెడ్డి, నాయకులు దేవేంద్రరెడ్డి, బుజ్జి, బాలాజీ, మస్తాన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో చేపల చెరువులు!

### జాతీయ నాయకుల పేరుతో ట్రస్టులు - యదేచ్ఛగా కనుమరుగవుతున్న సర్కారు ఆస్తులు - నిద్రావస్థలో రెవిన్యూ అధికారులు

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలం ఖాళీ కనపడితే చాలు.. చేపల చెరువులు, జాతీయ నాయకుల పేరుతో ట్రస్టులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వస్థలాలను కంటికిరెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ శాఖ కళ్ళుమూసుకున్నట్లు, నిద్రావస్థలో ఉన్నట్లు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దాంతో ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. గతంలో కాలువ పోరంబోకులు, చెరువు పోరంబోకుల్లో చేయిపెడితే భగ్గున మండిపడే రెవెన్యూ అధికారులు ప్రస్తుతం కూల్..గా తమకు ఫిర్యాదు అందలేదని, అందితే పరిశీలిస్తామంటూ వివరణలు ఇస్తున్నారు. వారు స్పందించేలోపే ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఈనేపథ్యంలోనే తొట్టంబేడు మండలం చిట్టత్తూరు రెవెన్యూ పరిధిలోని రామలింగాపురం సమీపంలోని గాజులకండ్రిగ ఎస్టీకాలువకు వెళ్ళే దారి కాలువ పోరంబోకు చేపలచెరువుగా మారింది. గ్రామానికి సంబందించిన రోడ్డు కూడా మాయమైంది. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దారు అవకతవకలకు పాల్పడి ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులుకు దారాదత్తం చేయడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక బైపాస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న కోట్లు విలువచేసే భూములు కూడా ఇతరులకు కట్టబట్టెడంతో కార్యాలయంపై నిఘా పెట్టిన ఎసిబి అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో తొట్టంబేడు మండలం చిట్టత్తూరు రెవెన్యూ పరిధిలోని గాజులకండ్రిగలో సుమారు 30కుటుంబాలు నివాసం ఉండే ఎస్టీ కాలనీ ఉంది. సర్వే నంబర్ 427/3లో 160 ఎకరాలు, సర్వేనంబర్ 428/4లో 120 ఎకరాలు, 425/1లో 115 ఎకరాలు వరవకాలువ ఉంది. ఈసర్వేనంబర్ల ప్రదేశంలో మూడు వైపుల నుంచి వరవకాలువలు చేరుతాయి. ఈకాలువకు సమీపంలోని సర్వేనంబర్ 337లో సుమారు మూడు ఎకరాలు డికెటి పొలం ఉంది. వరవకాలువ, ప్రభుత్వ భూములు కనిపించడంతో చిట్టత్తూరు గ్రామస్తులతో కలసి కొందరు ఈ భూముల్లో చేపల చెరువులకు రంగం సిద్ధంచేశారు. ఇప్పటికే సమీపంలో రెండు చేపలచెరువులు ఉన్నాయి. సర్వే నంబర్ 425/1లోని వరవకాలువ భూమిని ఏడాది క్రితం ఎవ్వరికి అనుమానం రాకుండా చేపలగుంతగా మార్చివేసి తిరుపతికి చెందిన ఓ చేపల వ్యాపారికి గుంతను కూడా విక్రయించేశారు. దీనికి సమీపంలోనే సర్వే నంబర్ 427/3లో ప్రస్తుతం వరవకాలువ మొత్తాన్ని కబ్జా చేసే పనులు చేపట్టారు. ఎస్టీ కాలనీకి వెళ్ళే రోడ్డును సైతం ఆక్రమించేశారు. దీంతో కొందరు రెవెన్యూ అధికారులకు పిర్యాదుచేయడంతో



గాజులకండ్రిగ ఎస్టీకాలనీకి వెళ్ళే దారిలో చేపల చెరువు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సుమారు పదిహేను రోజుల క్రితం తహశీల్దార్ పనులను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేయడంతో పనులు నిలచిపోయాయి. అయితే తిరిగి పనులును మొదలు పెట్టారు. రెండు రోజుల నుంచి రేయిపగలు తేడాలేకుండా పనులు చేసి చేపలగుంటకు కట్టను వేశారు. కట్టలోపల జెసిబితో పనులు చేయిస్తున్నారు. ఓఇద్దరు నాయకులు కలసి ఈతతంగం అంతా నడిపిస్తున్నట్లు బాహాటంగా చర్చజరుగుతోంది.

**తహశీల్దార్ వివరణ..**

వరవకాలువలో చేపల చెరువు తవ్వకాలు చేపడుతున్నారన్న అంశానికి సంబందించి తహశీల్దార్ సుదీర్‌రెడ్డిని వివరణ కోరగా గత పదిహేను రోజుల క్రితం ఈ అంశం తన దృష్టికి వచ్చిందని ప్రస్తుతం పనులు నిలపివేశామని తెలిపారు. అయితే తిరిగి పనులు చేయిస్తున్నట్లు తెలిసిందని వరవకాలువలో పనులు జరగడం లేదంటూ పేర్కొన్నారు. అయితే చేపల చెరువు పనులు జరిగేది మాత్రం వరవకాలువలోనే అని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా తహశీల్దార్ దీనిపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోలీసుస్టేషన్లలో మరిన్ని నిఘానేత్రాలు!

### తిరుపతి జిల్లాలోనూ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రభాతవార్త-తిరుపతి:

సమాజంలో పోలీసువ్యవస్థ పటిష్టంతోబాటు ప్రజలకు పోలీసుసేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించేందుకు వీలుగా అన్ని పోలీసుస్టేషన్‌లలో నిఘానేత్రాలు (సిసికెమెరాలు) ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను ఇప్పటికే సిద్దంచేసిన పోలీసుశాఖ తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలు, రాష్ట్ర డిజిపి ఉత్తర్వులతో పోలీసు అధికా రులు, సిబ్బందిలో జవాబుదారీ తనం పెంపొందించేందుకు నిఘా నేత్రాలు ఏర్పాటు అవసరాన్ని గుర్తించారు. దీంతో తిరుపతి జిల్లాలో 20పైగా పోలీసు స్టేషన్‌లలో, చిత్తూరుజిల్లాలో 30వరకు పోలీసుస్టేషన్‌లలో పూర్తిస్థాయిలో నిఘా నేత్రాలు ఏర్పాటు అవసరాన్ని గుర్తించారు. ఇప్పటికే పోలీసుస్టేషన్‌లలో చాలావరకు సిసికెమెరా వ్యవస్థ



ఏర్పాటైంది. తిరుపతి నగరంలోని తూర్పు, పడమర, నేరవిభాగం, ట్రాఫిక్ విభాగం పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటయ్యాయి. ఇంకా లాకప్‌లలో కూడా కెమెరాలు ఏర్పాటుదిశగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుస్టేషన్‌లలో క్రిందిస్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి ఎస్ఐ, సిఐల, డిఎస్పీ అధికారుల వరకు పనితీరు గమనించేందుకు, ప్రజలు, బాధితుల పట్ల పోలీసులు వ్యవహరించే తీరు పర్యవేక్షణకు నిఘా నేత్రాలు ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికీ కొన్ని పోలీసుస్టేషన్‌లలో బాధితులు, ఫిర్యాదిదారులు, ప్రతివాదులను పిలిపించి విచారణ చేయడం, కొంతవరకు ఇబ్బందులు ఉన్నాయి. వీటన్నిటినీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో చూసేలా సిసి కెమెరాలు మరిన్ని పోలీసుస్టేషన్ లలో, ఎస్ఐలు, సిఐల గదుల్లోనూ ఏర్పాటుచేయనున్నారనేది సమాచారం. తిరుపతి నగరంలో పలు కూడళ్ళతో బాటు ప్రధాన ప్రాంతాల్లో, ఇతర కాలనీల్లో ,జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారుల కూడళ్ళలో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పర్యవేక్షణ వుంది.

## కాణిపాకంలో విమాన గోపుర కలశ ఊరేగింపు



విమాన నగోపురం కలశాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న దాతలు, అధికారులు

కాణిపాకం, ఆగస్టు 17 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ప్రధాన ఆలయ చతుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకం పూజల్లో భాగంగా మూడోరోజు బుధవారం సాయంత్రం విమానగోపురం కలశ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈనెల 21న జరుగనున్న ఆలయ మహాకుంభాభిషేకంకు సంబంధించి సోమవారం నుండి ఆలయంలో కుంభాభిషేకం పూజలు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మూడో రోజు ఉదయం వేదపండితులచే చతుర్వేద పారాయణం, చతుర్వేదహవనం తదితరకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం చతుర్వేద పారాయణం, చతుర్వేదహవనం, లఘుపూర్ణాహుతి, కలశారాధన, నీరాజన మంత్రపుష్పములు, గణపతిపూజ, పుణ్యాహావాచనం, అనుజ్ఞ, ప్రవేశబలి, తదితర పూజాధి కార్యమ్రాలను నిర్వహించారు. అలాగే విమానగోపురం కళశాన్ని మంగళవాయిద్యాల నడుమ స్థానిక మణికంఠేశ్వరాలయం నుండి మాఢావీధుల గుండా ఆలయంకు తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ దాతలు గాయత్రీదేవి, ఐకా రవి, జానకి, గుత్తికొండ శ్రీనివాస్ దంపతులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కస్తూరి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్‌లతో పాటు వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యవిశ్వవిద్యాలయంలో చిరుత భయం!

### -చీకటిపడితే బయటకు రావద్దంటూ హెచ్చరిక

తిరుపతి, ఆగస్టు 17ప్రభాతవార్త:



తిరుపతినగరంలో శేషాచలం అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం. పశువైద్య విశ్వవిద్యాలయాలు ఉండటంతో తరచూ చిరుతపులుల భయం ఉంది. గతంలో ఎస్వీ విశ్వవిద్యాలయం ఆవరణలో చిరు తలు సంచరించి కుక్కలను నోటకరచు కున్నాయి. తాజాగా మళ్లీ పశువైద్య విశ్వవి ద్యాలయం ప్రాంగణంలో చిరుతల సంచారంతో అటు అధ్యాపకవర్గం ఇటు విద్యార్థులు భయంభయంతో వణుకుతున్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణాల్లో కుక్కల సంచారంతో అటవీప్రాంతంలోంచి చిరుతలు ఇటుగా వస్తున్నట్లు అటవీశాఖ వర్గాలు గుర్తించాయి. అయితే చిరుతల భయంతో విద్యార్థులు చీకటిపడితే హాస్టళ్ళ నుంచి బయటకు రావద్దని, రాత్రివేళ గస్తీకి సెక్యూరిటీ సిబ్బందిని మరింతమందిని కాపలా వుంచుతామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఏ.రవి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పశువైద్యవిశ్వవిద్యాలయం ప్రాంగణంలో చిరుత పులి కుక్కలు వేటాడుతూ రావడాన్ని సిసికెమెరాల్లో గుర్తించారు. చిరుతలు రాకుండా మంకీగన్స్‌తో శబ్దాలు చేసి తరిమివేస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లోని విద్యార్థులకు వారివారి ఫోన్‌నంబర్లకు, విశ్వవిద్యాల యం వాట్సాప్ గ్రూప్‌లో అప్రమత్తం చేశామన్నారు. కాగా విశ్వవిద్యాలయంలో సంచరిస్తున్న చిరుతలను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటుచేస్తామని, మనుషుల మీద దాడిచేసే వీలులేదన్నారు. సామాన్యంగా చిరుతలు మనుషుల కదలికలతో దూరమవుతాయని, అయినా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సబ్‌డిఎఫ్ఓ శ్రీనివాసరావు తెలిపారు.





రిజిస్ట్రార్ ఆచార్య ఏ.రవి,
అటవీశాఖ సబ్‌డిఎఫ్ఓ శ్రీనివాసరావు

## విశ్వరూప దర్శనంతో భక్తులను కటాక్షించిన శ్రీగంగమ్మతల్లి

రేణిగుంట, ఆగస్టు 17 ప్రభాతవార్త



శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతరలో భాగంగా అమ్మవారు విశ్వరూప దర్శనంతో బుధవారం భక్తులను కటాక్షించారు. ఆలయ వంశపారం పర్య ధర్మకర్త ఉత్సవ కమిటీ ఛైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు వీఆర్ రావణన్, జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉమేష్ తదితరులు సాయంత్రం అమ్మవారికి మహా కుంభాన్ని సమ ర్పించారు. ఉదయం నుంచి దేవాలయం వద్ద గంగమ్మ తల్లికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నడివీధి గంగమ్మ శూలం వద్ద ప్రతిష్టించిన అమ్మవారి విశ్వరూపం ప్రత్యేక పూజలు అందుకుంది. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. సదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. జాతర నిర్వాహకులు భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. దర్శనానికి దాదాపు 3 గంటల సమయం పట్టింది. అమ్మతల్లి నామస్మరణలతో రేణిగుంట పట్టణం మారుమోగింది. రంగుల రాట్నా లు, కొలంబస్, టపాసులు బాణ సంచాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించి జిల్దిలో కలపడంతో జాతర తంతు ముగిసింది. డీఎస్పీ రామచంద్ర నేతృత్వంలో అర్బన్ సీఐ సుబ్బా రెడ్డి, అర్బన్ ఎస్ఐలు సునీల్, ఈశ్వరయ్య, గాజులమండ్యం ఎస్ఐ ధర్మా రెడ్డి తమ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. వంశ పార్యం పర్య ధర్మకర్త మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ జాతర నిర్విఘ్నంగా జరగడానికి ప్రో త్సహించిన ఎమ్మెల్యే బియ్యపుమధుసుదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేశారు. ఎమ్మెల్యే కుమార్తె పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, డీఎస్పీ రామచంద్ర, సుబ్బారెడ్డి, ఎస్ఐలు సునీల్, ఈశ్వరయ్య, ధర్మారెడ్డి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



దేవాలయ వంశపారంపర్య
ధర్మకర్త మల్లికార్జున్‌రెడ్డి

## రసాభాసగా మారిన ప్రజాభిప్రాయ సేకరణ

### - అధికారులు గోబ్యాక్ అంటూ నినాదాలు



ఆర్డీవోతో మాట్లాడుతున్న కొత్తపట్నం గ్రామస్థులు

కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండలంలోని కొత్తపట్నం గ్రామంలో బుధవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. అధికారులు కొత్త సిలికా మైనింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సభ రచ్చరచ్చగా మారింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణను ఎలాగైనా నిర్వహించేందుకు అధికారులు పోలీసు బలగాలను సైతం రంగంలోకి దించారు. అయినా ప్రజలు ససేమిరా ఒప్పుకోలేదు. అధికారులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సర్వే నంబర్ 314లో ఏడు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు బోరు పాయింట్లు ఉన్నాయని గుర్తు చేశారు. అదేవిధంగా సొన కాలువ ద్వారా 70 మంది రైతులు డీకేటీ పట్టాలు పొంది భూములు సాగు చేస్తున్నారని చెప్పారు. డి రిజిస్టర్‌లో కూడా రైతుల పేర్లు నమోదై ఉన్నాయని తెలిపారు. అప్పుడు ఇచ్చిన డీకేటీ పట్టాలు ఎప్పుడు రద్దు చేశారో రైతులకు తెలియదన్నారు. సీబీఐసీ పరిశ్రమకు అయితే తాము భూములిస్తామని, ఎందుకంటే పరిశ్రమలు వస్తాయి, మా గ్రామాల ప్రజలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సిలికా మైన్ల వల్ల మా భూములు ఎడాదిగా మారిపోయి సాగునీటి సమస్య, తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ సిలికా మైనింగ్ ఏర్పాటు చేయవద్దని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్, సర్పంచ్ తిరుపాలయ్య, మండల ఉపాధ్యక్షుడు ఉప్పల శేషయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా, ఈ ప్రజాభిప్రాయ సేకరణకు గూడూరు ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు.. జాగ్రత్త!

తిరుపతి (క్రీడ), ఆగస్టు 17 ప్రభాతవార్త:

సైబర్ నేరగాళ్లు వారు వీరు అని తేడా లేకుండా వారి వలలో పడే ప్రతి ఒక్కరినీ బురిడీ కొట్టిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం సచివాలయ హెల్త్ సెక్రటరీకి ఫోన్ చేసి కరోనాతో మృతి చెందిన వారికి ఎవరెవరికి 50 వేల రూపాయలు వంతున ప్రభుత్వం నుంచి చెల్లించారు. ఇంకా ఎవరెవరికి రాలేదో వివరాలు తెలపాలని, తాము డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని సైబర్ నేరగాళ్లు వల వేశారు. దీంతో ఆమె వారికి పూర్తి వివరాలు తెలియ జేసింది. ఈ వివరాల సహాయంతో సైబర్ నేరగాళ్లు ఓ బాధితు రాలికి ఫోన్‌చేసి తాము డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని మీ వివరాలు తెలియజేయాలని కోరగా తాము ఎం దుకు మీకు వివరాలు తెలియజేయాలని ఆ మహిళ ప్రశ్నించగా అధికారులనే ప్రశ్నిస్తావా అంటూ కాన్ఫరెన్స్ కాల్ కలిపి సచి వాలయ సెక్రటరీకి ఫోన్ కలిపి ఇంతకు మునుపు తాము డిఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేశామని అడగగా అవునని కాన్ఫరెన్స్ కాల్‌లో బాధితురాలితో కూడా మాట్లాడించారు. దీంతో బాధితురాలు పూర్తిగా నమ్మి వారికి వివరాలను వీడియో కాల్ ద్వారా వాట్సప్‌లో వివరించింది. వీడియో రికార్డింగ్ ద్వారా వారి వివరాలను తెలుసుకుని సదరు బాధితురాలి యొక్క బ్యాంకు ఖాతా నుంచి 79 వేల 998 రూపాయలను తస్కరించారు. అందువల్ల ఎవరైనా ఫోన్ చేసి తాము గవర్నమెంట్ ఉద్యోగస్తులని తెలిపి మీ వివరాలు అడిగిన ఎడల మీరు సదరు ఫోన్ నెంబర్ ఉద్యోగస్తుదేనా అని నిర్ధారించుకుని వివరాలు తెలిపాల్సి వుంది. మీ యొక్క భయాన్ని సైబర్ నేరగాళ్లు ఒక ఆయుధంగా వాడుకుని మిమ్మల్ని మోసం చేసి మీ నగదు తస్కరించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. అందువల్ల మీ వివరాలను గోప్యంగా వుంచుకోవాలని, ఎటువంటి పరిస్థితుల్లోను ఓటిపి, ఎం. పిన్, వ్యక్తిగత వివరాలు తెలియజేయకూడదు.

### తిరుచానూరు పిఎస్‌లో సైబర్ కేసు నమోదు!

తిరుచానూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సైబర్ కేసు నమోదు చేశామని సిఐ సుబ్రహ్మణ్యంరెడ్డి మీడియాకు తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాల పద్దతుల్లో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా తిరుచానూరు గ్రామానికి చెందిన డి.జితేందర్‌రెడ్డి అనే వ్యక్తి ఖాతా నుండి 79 వేల 998 రూ॥లు కాజేయడం జరిగింది. ప్రజలు అందరూ ఇలాంటి అనుమానపు ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను తెలియని వ్యక్తులకు చెప్పవద్దని ఆయన సూచించారు.

# 31 న పోలేరమ్మ జాతర చాటింపు



వెంకటగిరి ఆగస్టు 17 ప్రభాతవార్త : దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధి గాంచిన వెంకటగిరి గ్రామస్వరూఫిణి పోలేరమ్మ అమ్మవారు జాతర జరుగుతుందని మొదటి చాటింపు ఈ నెల 31వ తేదిన వేస్తారని నిర్వాహకులు తెలిపారు. రెండవ చాటింపు సెప్టెంబరు నెల 7వ తేదిన వేస్తారు, 11 వే తేదిన ఘటోత్సవం నిర్వహిసా_ రు. 14 వతేదిన అమ్మవారి నిలుపు, 15 వతేదిన భక్తుల దర్శన అనంతం అమ్మవారి నిరూపమానం జరుగుతుం దన్నారు. ఎంఎల్ఎ ఆనం రామనారాయాణరెడ్డి అమ్మవారికి స్వర్ణకిరీటాన్ని జాతర నాటికి తయారు చేయించేందుకు దేవాదాయ అధికారుల చేతప్రయత్నాలు చేస్తున్నారు. అమ్మవారి బంగారు కిరీటాన్ని చెన్నైలో తయారు చేయిస్తున్నారు. బంగారు ఆభరాణాలను కూడ తయారు చేయిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ దొంతు శారద ఐదున్నర లక్షల రూపాయలు, జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజి చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి ఐదు లక్షల 116 రూపాయలను ఇప్పటి వరకు అత్యధికంగా ఇచ్చిన వారికిలో ఉన్నారు. బంగారు కిరీటానికి దాదాపు కోటి 20 లక్షల రూపాయల వరకు అవుతందని అంచన, అయితే దాతలు ఇచ్చినా తయారికి డబ్బులు చాలకపోతే ఇంకా ఎంత కావలెనో తాను ఇస్తానని ఎంఎల్ఎ ఆనం రామనారాయాణరెడ్డి ప్రకటించినట్లు తెలిసింది, జాతరకు ముమ్మరంగ ఏర్పాట్లు జరుగుతున్నాయి,

# వినూత్న ఆలోచనలు ప్రోత్సహించడానికే సినర్జి ఫర్ ఇన్నోవేషన్ :వైస్ చాన్సలర్



తిరుపతి (విద్య), ఆగస్టు 17 ప్రభాతవార్త: మహిళా విద్యార్థుల వినూత్న ఆలోచనలను ప్రోత్సహిం చడానికే శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో సినర్జి ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ అండ్ ఎంట్రపె న్యూర్షిప్‌ను ఏర్పాటు చేశామని వైస్ చాన్సిలర్ ఆచార్య జమున తెలిపారు. బుధవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో నిర్వహించిన జాయింట్ సింపోజియం ఆన్ బిల్డింగ్ ఇన్నోవేషన్ ఇంక్యు బేషన్ అండన ఎంటర్పెన్యూర్ రియల్ ఎకో సిస్టం, ఎక్రాస్ హెచ్ఈఐ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ను ఎస్ఎస్ఐఈ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి ఐఐటి ఎంఎఓఈ ఇన్నోవేషన్ సెల్, ఏపి స్టేట్ కౌన్సిల్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్సిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, తిరుపతి ఐఐటి నవ విష్కర్ 1 హబ్ ,నేషనల్ ఇన్సిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బిల్డింగ్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్ పెన్యూరియల్ ఎకో సిస్టెండ్ ఎక్రాస్‌హె ఈఎల్ఎస్ ఆఫ్ ఏపి అన్న అంశంపై సింపోజియంను సావేరి సెమినార్ హాల్‌లో నిర్వహించారు. అనంతరం తిరుపతి ఐఐటి డైరెక్టర్ ఆచార్య కే.సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి పరిశోధన సంస్థల వరకు ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పౌండేషన్ ను ఇన్నోవేషన్ ఇన్సులేషన్ అండ్ ఎంట్రపెన్యూర్షిప్ కార్యకలాపాలను ఏర్పాటు చేశారుని గుర్తు చేశారు. అందులో భాగంగ వంద కోట్ల రూపాయలతో పొజిషనింగ్ అండ్ ప్రెసిషన్ టెక్నాలజీలో టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌ను హోస్ట్ చేయ డానికి ఐఐటిటిఎన్ఐఎఫ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి ప్రధాన విద్యాకేంద్రంగా వున్నందున బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అవకాశం వుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడి చెప్పినట్టు భారత దేశం అభివృద్ధి చెందిన దేశంలా చూడాలంటే రాబోయే సంవత్సరాల్లో మనం పంచ ప్రాణాలపై దృష్టి సారించాలని సూచించారు. భారత దేశం అభివృద్ధి అనేది సంపదను జ్ఞానంగా మార్చడానికి ఉపయోగపడుతుందన్నారు. యువత వినూత్న ఆలోచనలతో గ్లోబల్ సినారీయోని దృష్టిలో వుంచుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే ఇన్నోవేషన్ అంబాసిడర్స్ ప్రోగ్రామ్స్, ఇన్నోవేషన్ స్టార్టప్ పాలజీ, పాలసీ డిజైన్, థింకింగ్ వంటి ప్రభుత్వ ఇన్నోవేషన్ కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 2014లో మన ర్యాంక్ 81 కాగా ఇప్పుడు 46వ ర్యాంకుగా వుందన్నారు. సరైన లక్ష్యాలు, వినూత్న ఆలోచనలు ద్వారా గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో ఎదగడానికి సహాయపడుతుందన్నారు. బలమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ వినూత్న ఆలోచనలను ముందుకు తీసుకెళ్లినపుడు ఇది సాధ్యపడుతుందన్నారు.

# స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రోజా







పుత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుత్తూరు మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ (చిట్టి), ఆయన సోదరుడు రిజర్వ్ బ్యాంక్ ముంబయి శాఖ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.జయచంద్రబాబు ఇద్దరూ కలిసి భారత యువతకు ఎప్పటికీ మార్గదర్శకుడైన వివేకానందుడి విగ్రహాన్ని నెలకొల్పాల నుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. యువతను మంచి మార్గంలో నడిపేందుకు ఆయన దేశమంతా తిరిగి ప్రభోదాలు చేశారని, మహాత్మా గాంధి కూడా వివేకానంద ప్రసంగా నికి మంత్ర ముగ్ధులయ్యారని తెలిపారు. ఆయన పరమపదించి 120 సంవత్సరాలు గడిచినప్పటికీ భారత జాతి మరువలేని వ్యక్తి వివేకానందుడని తెలిపారు. లక్ష్య సాధనలో విఫలమైనా అది సాధించేంత వరకూ ప్రయత్నించాలని, మందలో ఒకరిగా కాదు, వందలో ఒకరుగా వుండాలని ఆయన చేసిన బోధనలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆదర్శ వంతమైన సమాజ స్థాపన యువత నడవడికపై ఆధారపడి వుంటుందని వివేకానందుడి బోధనలు చదివి విద్యార్థులంతా ఆ దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన చెప్పడమే కాకుండా రామకృష్ణ మిషన్ స్థాపించి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు ఎంతో కృషి చేయాలని కొనియాడారు. అనంతరం మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ మాట్లాడుతూ తమ తల్లితండ్రుల జ్ఞాపకార్ధంతో పాటు కాలేజీ పూర్వ విద్యార్థిగా వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేశామని చెబుతూ దీనికి సహకరించిన కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జయప్రకాష్, ఆయన కుటుంబ సభ్యులు మంత్రి రోజాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, వైకాపా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న సిఎం ఇళ్ళు ముట్టడి





శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త : సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడి కార్యక్రమానికి ఎపిసిపిఎస్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రేగంటిదేవానంద్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోపే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ ప్రవేశపెడుతామన్న ముఖ్యమంత్రి మాట తప్పి, మడమ తిప్పడం న్యాయమా? అని ప్రశ్నించారు. బుధవారం సిపిఎస్ ఉద్యోగులు మధ్యాహ్నభోజన విరామసమయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనాథ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సిపిఎస్ ఉద్యోగులకు చీకటి రోజైన సెప్టెంబర్ 1న తాడేపల్లిగూడెంలోని ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి కార్యక్రమంపై తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చర్చించిఆమోదరం తెలిపారు. ఈసందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు అల్లూరయ్య మాట్లాడుతూ రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు జరుపుతున్నాయని, అయితే మన రాష్ట్రంలో పాత పెన్షన్ ప్రవేశపెట్టకపోవడం దారుణం అన్నారు. ట్రెజరర్ గంగయ్య మాట్లాడుతూ పాత పెన్షన్ సాధించే వరకు పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ప్రతి సిపిఎస్ ఉద్యోగి తమ హక్కు అయిన పాత పెన్షన్ పొందే వరకు నిరంతరం పోరాడాలని సంఘ సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో రూపాణి, చందన, హేమ, శివానీ, జనార్ధన్‌నాయుడు, సూరి, మల్లీశ్వరయ్య, నాగరాజు, రాజయ్య, హరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిటిడిలో సేవా పతకాల రగడ!

### -నాయిబ్రాహ్మణ ఉద్యోగులకివ్వరా?



తిరుపతి,ఆగస్టు 17 ప్రభాతవార్త: ధార్మికసంస్థ టిటిడిలో పలు రకాలుగా ఇతోధిక సేవలందిస్తున్న నాయిబ్రాహ్మణ ఉద్యోగులు, సిబ్బందికి సేవా పతకాలు ప్రకటించకపోవడం వెనుక వివక్షత ఉందని అత్యంత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్య క్షుడు ఇనుకొండ సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ డి.విజయ భాస్కర్ అసహనం వ్యక్తం చేశారు. మొన్న జరిగిన 75వసంతాల స్వాతంత్ర్యదినోత్సవ వేళ టిటిడి కల్యాణకట్టలో సేవలందిస్తున్న నాయీ బ్రాహ్మణ ఉద్యోగులు, క్రిందిస్థాయిలో సిబ్బంది సేవలను గుర్తించకపోవడం ధార్మికసంస్థలో అధికారుల తీరు మంచిది కాదన్నారు. గత కరోనా సమయంలోనూ కల్యాణకట్టలో క్షురకులు భక్తులకు సంయమనంతో తలనీలాలు తీశారని, అలాంటి వారి సేవలు గుర్తించి వారికి సేవా పతకాలు ఇవ్వకపోవడం బాధాకర మన్నారు. అసలు ఏడుకొండల వెంకన్నపై ఎంతో భక్తివిశ్వాసాలతో వచ్చే భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా తొలుత తలనీలాలు సమర్పిస్తారన్నారు. అలాంటి వారికి ఎంతో సహనంతో, సంయమ నంతో తలనీలాలు తీసే నాయిబ్రాహ్మణులను, ఇంకా ఆలయంలో పలు సేవల్లో, కైంకర్యాల్లో మంగళధ్వనితో సేవలందించే వారికి సేవ పురస్కారాలు, కనీసం ప్రశంసాపత్రాలు ఇవ్వకపోవడం వివక్ష అని పేర్కొన్నారు. టిటిడిలో కేవలం ఉద్యోగులు, అధికారులకే ఈ ప్రశంసాపత్రాలు, పతకాల పురస్కారాలు ప్రదానం ఎంతవరకు సమంజసమని ఇనుకొండ సుబ్రమణ్యం ప్రశ్నించారు. హిందూ ధార్మిక సంస్థలో ఇలాంటి వివక్షత చూపడం ఆయా సంఘాల ఉద్యోగుల, సిబ్బంది మనోభావాలకు దెబ్బతీసినట్లేనని అన్నారు.

## ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నూతన భవనాలు ప్రారంభం

తిరుపతిరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నూతన భవనాలు ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నూతన భవనాలను ప్రారంభించారు. ఆధునాతన వాతావరణ పరిశోధన కేంద్రం, అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ భవనాలను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆవరణలో రూ.13 కోట్లతో నిర్మించిన అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ భవనానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.పి.వాసంతి పూజ చేసారు. మారుతున్న వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టడమే కాక రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు ఎప్పటి కప్పుడు అందించే ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ కరిమల్ల, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ సత్యగోపాల్, డాక్టర్ సుబ్రమణ్యం, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిచే శ్రీపల్లెరుచులు ప్రారంభం



గంగవరం, ఆగస్టు 15, ప్రభాతవార్త : మండలంలోని బెంగళూరు చెన్నై జాతీయ రహదారి పక్కన ఇండస్ట్రీయల్ ఎస్టేట్ సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ ఆర్.చెంగారెడ్డి నూతనంగా నిర్మించిన శ్రీ పల్లెరుచులు రెస్టారెంట్‌ను విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ ధరలతో నాణ్యమైన భోజనం ప్రయాణికులకు అందించాలని నిర్వాహకులుకులు చెంగారెడ్డి, రమేష్‌రెడ్డిలకు సూచించారు. ఆయనతో పాటు వైసీపి నాయకులు మొగసాల రెడ్డెమ్మ క్రిష్ణ మూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, రాఖేష్‌రెడ్డి, పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్‌రెడ్డి, జెకె, మండి సుధా, ఎస్‌కెఎస్ జాఫర్, శశిధర్‌నాయుడు, కోదండరామయ్య, ఉప సర్పంచ్ మంజు నాథరెడ్డి, ఏటిగడ్డ శ్రీరాములు రెడ్డి, చలపతిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఎస్సీటి బాలాజీ, అనిల్, ఆనంద్, బాబు, రమణలు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మతల్లి జాతర సంబరాలు



నారాయణవనం, ఆగస్టు 17 ప్రభాతవార్త : మండలంలోని నారాయ ణవనం పంచాయతీతో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో మంగళ వారం నుంచి గంగజాతర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం కూడా అమ్మవారిని గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో జాతరను ఘనంగా చేసుకున్నారు. మొక్కుబడి కలిగిన భక్తులు జ ంతుబలి ఇచ్చారు. నారాయణవనంలో బలిజసంఘం ఆధ్వర్యంలో నిర్వహకులు చలపతి బాబు, శరత్‌కుమార్ సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్ దగ్గరుండి నిర్వహించారు. బుధవారం ఊరేగింపు సందర్భంగా మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ నిమజ్జనం చేశారు. సముదాయం గ్రామంలో మొక్కుబడి కలిగిన భక్తులు శరీరానికి ముళ్ల గుచ్చుకొని వాహనాలపై వ్రేలాడుతూ విన్యాసం చేయడం భక్తులను మరింతగా ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలను నారాయణవనంలో బలిజ సంఘం నాయకులు శరత్‌కుమార్, చలపతిబాబు, నారాయణవనం సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, వారి కుమారులు రామలక్ష్మణన్‌లు, సముదాయంలో సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి, హేమచంద్రారెడ్డి, దళవాయి.బాబురెడ్డి, బొబ్బరాజుపాలెంలో మాజీ జడ్పీటిసి ధర్మయ్య, సర్పంచ్ రమేష్, మాజీ ఎంపిటిసి దామోదర్‌శెట్టి, నాగిలేరులో తాజా మాజీ సర్పంచ్ పి.కస్తూరిగిరిబాబు, వికెపాలెంలో సర్పంచ్ ధర్మలింగం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

## వంటమ్మలు వర్సస్ అయోరమ్మ

### -పంచాయితీ చేసేవాళ్లు లేక పాఠశాలలో లొల్లి

సత్యవేడు, ఆగస్ట్17, ప్రభాతవార్త: వంటమ్మలు వర్సస్ అయ్యోరమ్మ అన్నచందంగా మారింది దాసుకుప్పం ఉన్నత పాఠశాలలో పదిరోజులుగా వారి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్నా సమస్యకు పరిష్కారం మాత్రం కనిపించడంలేదు. మండల పరిధిలోని దాసుకుప్పం పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వంట చేస్తున్న మల్లిక, లీలావతి, కమలమ్మను వారం రోజుల కిందట తొలగించారు. పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి తాత్కాలికంగా విద్యార్థులకు వంట చేసేందుకు ఏర్పాట్లు చేశారు. తాము వంట చేస్తామని బుధవారం పాతవారు అక్కడకు చేరుకుని పాఠశాల హెచ్ఎం జ్యోతిను కోరారు. అయితే ఆమె సానుకులంగా సమాధానం ఇవ్వకపోగ తమను దుర్భాషలాడినట్లు వారు వెల్లడించారు. దీనిపై స్థానిక ఎంఈవోకు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్‌తో కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వంట సక్రమంగా చేయకపోవడం, సరుకులు తెచ్చుకోవడంలోను నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా వారిని తొలగించి పాఠశాల కమిటీ సూచనల మేరకు తాత్కాలికంగా నియామకం చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

## అమ్మవారి సేవలో స్పీకర్ తమ్మినేని!

తిరుచానూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని బుధవారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ శేషగిరి, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఏవిఎస్ఓ శైలేంద్రబాబులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వీరికి ఆశీర్వాద మండపం వద్ద వేదాశీర్వాదంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## గణనాధుని సన్నిధిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని



కాణిపాకం, ఆగస్టు 17 ప్రభాతవార్త: ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబసమేతంగా బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామిని దర్శించుకున్నారు. సుపథమండపం వద్ద జిల్లా హరినారాయణన్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. స్పీకర్ తమ్మినేని వెంట జిల్లా కలెక్టర్, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీనివాస్, ఐరాల తహశీల్దార్ సుశీల, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి పడిమెట్లపూజలో మంత్రి



కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త : చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌లు మంగళవారం రా త్రి స్థానిక శ్రీ సోమేశ్వరాలయంలో చేపట్టిన అయ్యప్పస్వామి పడిమెట్ల పూజ కార్యక్రమంకు రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి హాజరయ్యారు. రాత్రి పదకొండు గంటలకు మంత్రి కుప్పంకు చేరుకోగా వైకాపా శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పడిమెట్ల పూజలో పాల్గొన్నారు. మంత్రి రాక ఆలస్యమైనా వైకాపా శ్రేణులు వేచి ఉండి మంత్రిని కలసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునసా ్వమి, హఫీజ్, కౌన్సిలర్లు సయ్యద్ అలీ, మణి, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎపిసిఎస్‌సిడైరెక్టర్‌శ్రీనివాసమూర్తి, ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



రామకుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయిబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణులను కించపరచే పదాలు ఉచ్ఛరించరాదని ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు ప్రకాష్, పళని, కృష్ణమూర్తి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాదుడే బాదుడులో టిడిపి



తిరుపతి,ఆగస్టు 17ప్రభాతవార్త: ఎడాపెడా ధరలను పెంచి పేదప్రజలను వేధించుకుని ఇబ్బంది పెడుతున్న అధికార వైకాపా ప్రభుత్వానికి చరమగీతం పాడాలని టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ అన్నారు. ఈ ప్రభుత్వం మూడేళ్లలో పెంచిన ధరలు, విద్యుత్ చార్జీల భారం, వంటగ్యాస్ పెంపు తదితర వాటిపై బాదుడేబాదుడు కార్యక్రమం బుధవారం సాయంత్రం ఆర్‌సిరోడ్డు యాదవకాలనీలో ఇంటింటికి టిడిపి నాయకులు వెళ్ళి ప్రచారం చేశారు. ప్రజలను దోపిడీచేస్తున్న జగన్ ప్రభుత్వానికి త్వరలో బుద్దిచెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణమ్మ, బుల్లెట్‌రమణ, వట్టికుంట శంకరనా రాయణ, రవినాయుడు, కృష్ణయాదవ్, సింధుజ, ఆర్‌సి మునికృష్ణ, ఆముదాల తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో ప్రభుత్వ సాయం: మంత్రి రోజా



పుత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త: రైతులకు సకాలంలో ప్రభుత్వ సాయం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని వైఎస్ఆర్ క్రాప్ నమోదు ప్రక్రియతో రైతుల ందరికి న్యాయం జరిగేలా చూడాలని మంత్రి రోజా సూచించారు. బుధవారం పుత్తూరు మండలంలోని గొల్లపల్లిలోని చెరకు పంట వద్ద వైఎస్ఆర్ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీ లించారు. రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, ఏడీఏ రమేష్‌రాజు, ఏవోకోదండయ్య, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు విరిత, మురళి, వీపిఏ ప్రత్యూష, నాయకులు పాల్గొన్నారు

## జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 17 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిగా కార్మిక శాఖ జాతీయ సదస్సు జరగనున్నదని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ సదస్సుకు విధులు కేటాయించిన లైజన్ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. జేసీ మాట్లాడుతూ ఈనెల 26న దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి కార్మిక శాఖల మంత్రులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు దాదాపు వంద మందికి పైగా జిల్లాకు రానున్నారని లైజన్ అధికారులదే కీలక పాత్ర అని అన్నారు. రేణిగుంట, చెన్నై విమానాశ్రయాల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. లైజన్ అధికారులు కేటాయించిన విధుల మేరకు సంబంధిత వీఐపీలతో సమన్వయం చేసుకుని వారి రాక వివరాలు, బస చేసే ప్రాంతం, వాహనాల వంటి సదుపాయాల కోసం సంబంధిత కమిటీల వివరాలు మీ వద్ద ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్, ట్రాన్స్‌ఫర్ట్ అకాండేషన్, ప్రోటోకాల్, ఐటీ, మెడికల్ దర్శన్, రిసెప్షన్ వంటి కమిటీల వివరాలు అందుబాటులో ఉంచుకుని ఎప్పటికప్పుడు వీఐపీలకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలను అందించాలని సూచించారు. తిరుమల దర్శనంకు వెళ్ళే వీఐపీలకు సంప్రదాయ దుస్తులలో రావాలని తెలియజేస్తూ , వారి ఆధార్ నెంబరు తప్పనిసరి కమిటీకి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో పీఎఫ్ డిపార్ట్మెంట్ కమీషనర్ వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, విధులు కేటాయించిన లైజన్ అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం : ఎస్పీ



గుడిపాల, ఆగస్టు 17 ప్రభాతవార్త: నేరాల నియంత్రణతో పాటు వివిధ కేసుల చేధనలో సిసి కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి, గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ నిర్వహణలో నేరాల నియంత్రణ కోసం గుడిపాల క్రాస్, గుడిపాల పోలీస్ స్టేషన్ ముందు, వెనుకవైపు, పసుమంద క్రాస్, పాత, కొత్త ఎంసిఆర్ క్రాస్, నంగమంగళం, బొమ్మసముద్రం క్రాస్‌ల వద్ద 25 హై రెసుల్యూషన్ ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుడిపాల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలు తగ్గుముఖం పడుతాయన్నారు. ఎలాంటి ఆధారాలు లభించనప్పటికీ నిందితులను పట్టుకోవడంలో సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. మండలంలోని ముఖ్యమైన కూడళ్ళలో త్వరలోనే అదనపు సిసి కెమెరాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, వెస్ట్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి, గుడిపాల ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధునికి మూడు కిలోల వెండి దీపస్థంభం బహూకరణ

కాణిపాకం, ఆగస్టు 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారికి ఓ భక్తురాలు బుధవారం మూడు కిలోల వెండితో తయారు చేయించిన దీపస్థంభంను విరాళంగా అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు ఎన్‌పీ.దుర్గా రామకృష్ణ కుమార్తె ఎన్‌పీ.కాత్య అనే భకు_రాలు సుమారు 2.20 లక్షల రూపాయల వ్యయంతో మూడు కిలోల వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన దీపస్థంభంను ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈదీప స్థంభంను ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీ ఎన్‌పీ.దుర్గా రామకృష్ణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఐరాల మండల బిజెపీ అధ్యక్షుడు ఎం.కుమార్, ఆదినారాయణ, పరదేశిలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇకపై నిత్యాన్నభోజన పథకం : బొల్లినేని



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త : నిరుపేదలకు ఇకపై ప్రతిరోజు మధ్యాహ్న భోజనంను ఏర్పాటు చేశామని రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధంనాయుడు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇకపై ప్రతిరోజు పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న జగన్నాధం నాయుడు జెకె స్టీల్స్ అండ్ సిమెంట్స్ ప్రొపైటర్ దుకాణం వద్ద నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు జి.విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, తొట్టంబేడు మండలపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడులు విచ్చేశారు. ఈసందర్భంగా జగన్నాధంనాయుడు మాట్లాడుతూ బైపాస్ మార్గంలోని ప్రాంతంలో హమాలీలు, ఆటోకార్మికులు, భవననిర్మాణకార్మికులు ప్రతినిత్యం వస్తుంటారని వారికి కూలిపనులకు వెళ్లే వచ్చే కూలీలో రోజుకు రూ.80లు భోజనం ఖర్చు అవుతుందని అందరికీ కడుపునిండా అన్నంపెట్టేందుకే ఈ కార్యక్రమాన్ని శివయ్య అనుగ్రహంతో ప్రారంభించామన్నారు. తనకు వెన్నంటి ఉన్న మిత్రులు తనకు సహకరించాలని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు మూడుపూటల అన్నం పెట్టేందుకు ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్లను ప్రస్తుత ప్రభుత్వం మూసివేసిందని ప్రస్తుతం జగన్నాధంనాయుడు నిరుపేదలకు నిత్యాన్నదాన పథకం ద్వారా ఆకలితీర్చడానికి కార్యక్రమం చేపట్టి నందుకు ధన్యవాదాలు తెలిపారు. తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు మాట్లాడుతూ జెకెస్టీల్స్ ప్రొపైటర్ నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామం అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, గాలిమురళీనాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా.రమేష్, ప్రకాష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, రమేష్, సురేష్, రాంబాబునాయుడు, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్, దొరబాబు, మునివేలు తదితరులు పాల్గొన్నారు.